సాక్షి
అన్నమయ్య జిల్లా
శనివారం । 13 । జూలై । 2024



నీలి నాలుక వ్యాధితో ముప్పు

వర్షాల రాకతో గొర్రెలు. మేకలకు నీలి నాలుక వ్యాధి సోకుతుంది. వ్యాధి సోకిన గొర్రెల్లో 20 నుంచి 50 శాతం చనిపోయే అవకాశం ఉంటుంది. -8లో



ఎర్రచందనం దుంగల స్వాధీనం

మద్దిమడుగు గ్రామానికి దగ్గర 28 ఎర్రచందనం దుంగలను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాటి బరువు 736 కిలోలు ఉంటుంది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.550	రూ.640
రెండోరకం	రూ.410	రూ.540



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 988 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	412	500
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 813.440 కిలోలు

న్యూస్‌రీల్

ముగిసిన వైవీయూ పీజీ పరీక్షలు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలలో గత నెల 28వ తేదీ నుంచి జరుగుతున్న పీజీ సెమిస్టర్ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. విశ్వవిద్యాలయంలోని 29 శాఖల విద్యార్థులు 2,4 సెమిస్టర్ల పరీక్షలను రాశారు. చివరి రోజున వైవీయూ ఆర్ట్స్ బ్లాక్‌లో జరిగిన పరీక్షలను పరీక్షా కేంద్రాలను వైవీయూ అధికారులు తనిఖీ చేశారు.

ఐదు కొత్త బస్సులు

మదనపల్లె సిటీ: మదనపల్లె వన్ డిపోకు ఐదు కొత్త బస్సులు వచ్చినట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రెండు సూపర్ లగ్జరీ బస్సులు హైదరాబాద్‌కు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. మూడు ఎక్స్‌ప్రెస్ బస్సులు కడప, బెంగుళూరు, బి.కొత్తకోటకు నడపనున్నట్లు తెలిపారు. ప్రతి పౌర్ణమికి అరుణాచలానికి ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు చెప్పారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఆర్డీఓ రంగస్వామి

రామాపురం: ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, వంకలు, వాగులు, ఆక్రమిస్తే చర్యలు తప్పవని అన్నమయ్య జిల్లా ఆర్డీఓ రంగస్వామి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఇక్కడ విలేకర్లతో మాట్లాడుతూ ఇసుక మట్టి రవాణా చేయాలంటే అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. ఆయా గ్రామాల్లో ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా చూసుకోవాలని వీఆర్‌ఓలకు సూచించారు. కులధ్రువీకరణ పత్రాలను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ సిద్దేశ్వరరావు, ఆర్‌ఐ రవికుమార్, వీఆర్‌ఓ విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

అటవీశాఖకు రూ.26 లక్షల ఆదాయం

బి.కొత్తకోట: మండలంలోని హార్సిలీహిల్స్ అటవీశాఖ ప్రాంగణంలోని గుత్తల ద్వారా రూ.26.6 లక్షల ఆదాయం లభించినట్టు మదనపల్లె రేంజర్ మదన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. అటవీప్రాంగణంలో ఎంట్రీ ఫీజు ఏడాది లీజు ద్వారా రూ.14.7 లక్షలు, మానస సరోవరంలో బోటింగ్ గుత్త ద్వారా రూ.9 లక్షలు, క్యాంటిన్ గుత్త ద్వారా రూ.2.9 లక్షల ఆదాయం వచ్చినట్టు తెలిపారు. వీటి నిర్వహణకు సంబంధించి నిబంధనలను గుత్తేదారులు పాటించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

విత్తన ఖర్చు లేకుండానే వేరుశనగ సాగు



ఏపుగా పెరిగిన వేరుశనగ పంట

తంబళ్లపల్లె: ఓ రైతు గతంలో సాగు చేసిన వేరుశనగ పంట కాయలు భూమిలోనే మిగిలిపోవడం, వర్షానికి మళ్లీ మొలకెత్తి పంట సాగు చేసిన విధంగా కనిపించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. తంబళ్లపల్లెకు చెందిన ఆనంద్ గత మార్చిలో ఒకటిన్నర ఎకరాలో వేరుశనగ పంట సాగు చేశాడు. ఆగస్టులో పంట కోసే సమయంలో వర్షాభావంతో కొన్ని కాయలు భూమిలోనే ఉండిపోయాయి. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో కురిసిన వర్షానికి భూమిలోని విత్తన కాయల నుంచి మొలకలు వచ్చాయి. రైతు వాటిని గుర్తించి విత్తనాలు వేసిన సాగులాగా ఉండటంతో మొక్కలను అలాగే ఉంచాడు. కూలీలతో కలుపు తీయించాడు. ఆ మొక్కలు ఏపుగా పెరిగాయి. ఒక్కో చెట్టుకు 5 నుంచి 10 కాయలకుపైగా ఉండటంతో ఏడు బస్తాల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతు ధీమా వ్యక్తం చేస్తున్నాడు. విత్తన ఖర్చు లేకుండా రెండో పంట రావడం ఆనందంగా ఉందని ఆయన అంటున్నాడు.

సాగని.. సాగు



- జిల్లా రైతులను వెంటాడుతున్న వర్షాభావం
- జూలై 15తో ముస్తున్న ఖరీఫ్ సీజన్
- వేరుశనగ, ఇతర పంటల సాగు లక్ష్యం 65,386 హెక్టార్లు
- సాగైంది 7,046 హెక్టార్లు



తంబళ్లపల్లె మండలం రామిగానిపల్లెలో దుక్కులు దున్నిన పొలంలో పెరిగిన గడ్డి

బి.కొత్తకోట: జిల్లాలో వర్షాభావ పరిస్థితులు వెంటాడుతున్నాయి. రైతుల్లో ఆందోళన కనిపిస్తోంది.ఖరీఫ్‌పై ఆధారపడి పంటలు సాగుచేస్తున్న రైతులు జిల్లాలో అత్యధికం. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటికే పంటల సాధారణ సాగు విస్తీర్ణం పూర్తి కావాల్సి ఉండగా అసలు సాగే సాగడం లేదు. రైతు కాడి కదలక మూలనపడింది. పంటలు సాగయ్యే అవకాశాలు సన్నగిల్లిపోతున్నాయి. జూలై 15లోగా వేరుశనగ విత్తనం పొలంలో పడకుంటే ఇక సాగు చేయాల్సిన అవసరం లేదు. దీంతో జిల్లాలో కరువు కమ్ముకొస్తోంది.

వేరుశనగ సాగు దారుణం

గతంలో ఎన్నడూలేని విధంగా ఖరీఫ్‌లో వేరుశనగ సాగు పరిస్థితి దారుణంగా ఉంది. ఖరీఫ్‌లో ఏటా అత్యధికంగా సాగయ్యే పంట వేరుశనగ.ప్రస్తుతం 42,852 హెక్టార్లలో సాధారణ సాగు జరగాల్సి ఉండగా కేవలం 5,950 హెక్టార్లకే పరిమితమైంది. 26,902 హెక్టార్లలో వేరుశనగ సాగు కావాల్సి ఉండగా వర్షాభావంతో సాగయ్యే సూచనలు కనిపించడం లేదు. రైతులు వేరుశనగ సాగుకు పొలాలను సిద్ధం చేసుకుని వర్షం కోసం ఎదురుచూసినా ఫలితం లేకపోవడంతో దుక్కులు చేసిన పొలాలు పిచ్చిమొక్కలతో నిండిపోయాయి.

కనుచూపు మేర బీళ్లే

జిల్లాలో ఖరీఫ్ సేద్యం లేకపోవడంతో కనుచూపుమేర బీడు భూములే కనిపిస్తున్నాయి. పంటలు సాగు చేసేందుకు రైతులు భూములను దుక్కులు దున్ని విత్తనం విత్తేందుకు సిద్ధగా ఉండగా వర్షాలు ముఖం చాటేశాయి.దీంతో రైతులు పొలాల వైపు వెళ్లడం లేదు. ప్రస్తుత ఖరీఫ్‌లో ఉద్యానవన పంటలు మినహా మిగిలిన అన్ని రకాల పంటలు 65,386 హెక్టార్లలో సాధారణ సాగు జరగాలి. అయితే జూలై రెండో వారం ముగుస్తున్నా పొలంలో విత్తు పడలేదు. ఇప్పటివరకు అన్ని రకాల పంటలు 7,046 హెక్టార్లలోనే సాగయ్యాయి. 58,340 హెక్టార్లు సాగుకు నోచుకోలేదు.

పంటల సాగు వివరాలు (హెక్టార్లలో)

పంటలు	సాధారణ సాగు	సాగైంది
ఆహార ధాన్యాలు	12,919	852
పప్పు ధాన్యాలు	8,470	223
నూనె గింజలు	43,459	5,970

11 మండలాల్లో లోటు

జూన్ ఒకటి నుంచి మంగళవారం (జూలై 9) వరకు జిల్లాలో కురిసిన సగటు వర్షపాతం లెక్కిస్తే 11 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. రామాపురం, వీరబల్లి, నందలూరు, చిట్వేలి, రాజంపేట, ఓబులవారిపల్లె, కోడూరు, వాల్మీకిపురం, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట, నిమ్మనపల్లె మండలాల్లో కనీస వర్షం కురవలేదు. గాలివీడు, చిన్నమండెం, సంబేపల్లె, ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కేవిపల్లె, కలికిరి, మదనపల్లె మండలాల్లో సగటుకు మించి వర్షం కురిసింది. మిగతా మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

ఖరీఫ్ వర్షపాతం మి.మీలో

నెల	సాధారణం	కురిసింది
మే	43	78.5
జూన్	75.1	160.6
జూలై	90.5	18.3



సాగైన పంటల వివరాలు (హెక్టార్లలో)

పంట	సాధారణసాగు	సాగైంది
వరి	10,037	278
సజ్జ	567	16
మొక్కజొన్న	1,848	558
కందులు	2,971	124
ఉద్దులు	26	1.3
అలసంద	697	43
అనుములు	497	55
వేరుశెనగ	42,852	5,950
ఆముదం	82	20

ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రణాళికలు



జిల్లాలో వర్షాలు కురవకుంటే ప్రత్యామ్నాయ పంటలు సాగయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేస్తాం. ఖరీఫ్ వేరుశనగ విత్తేందుకు మరో వారం రోజులు గడువు ఉంది. ఈలోగా వర్షాలు ఆశాజనకంగా ఉంటే పంటలు సాగవుతాయి. లేనిపక్షంలో రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా ప్రణాళికలను ప్రభుత్వానికి నివేదిస్తాం. –చంద్రానాయక్, జిల్లా వ్యవసాయ అధికారి

నేటినుంచి సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు

నందలూరు: అన్నమయ్య జిల్లాలోని నందలూరు శ్రీ సౌమ్యనాథ ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. శనివారం నుంచి 23వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ కుమార్ తెలిపారు. 13న రాత్రి అంకురార్పణ, 14న ధ్వజారోహణం, యాలి వాహనం, 15న హంసవాహనం, 16న సింహవాహనం, 17న హనుమంత వాహనం, 18న శేషవాహనం, రాత్రి గరుడ వాహనం, 19న సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ, 20న కల్యాణోత్సవం, 21న రథోత్సవం, రాత్రి అశ్వవాహనం, 22న చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణం, 23న పుష్పయాగం, ఏకాంత సేవా కార్యక్రమాలు ఉంటాయని ఆయన తెలిపారు.



విద్యుద్దీప కాంతులతో సౌమ్యనాథస్వామి ఆలయం

పార్టీ మారే ప్రసక్తే లేదు



ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

కడప కార్పొరేషన్: తాను పార్టీ మారుతున్నట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతులో ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలుపొందానని, చివరి వరకూ ఆ పార్టీకి కట్టుబడి ఉంటానన్నారు. వైఎస్సార్‌సీపీ అనుబంధ సభ్యునిగా కొనసాగుతానని, ఇప్పటికైనా ఈ దుష్ప్రచారం ఆపాలన్నారు.

రూ13,102కోట్లతో వార్షిక రుణ ప్రణాళిక ఆమోదం

జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్



జిల్లా వార్షిక రుణ ప్రణాళికను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ తదితరులు

రాయచోటి: అన్నమయ్య జిల్లాకు సంబంధించి 2024–25లో రూ13,102 కోట్లతో జిల్లా వార్షిక రుణ ప్రణాళిక ఆమోదించినట్లు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన బ్యాంకర్లతో జిల్లా సంప్రదింపుల కమిటీ(డీసీసీ).. జిల్లా స్థాయి సమీక్ష కమిటీ(డీఎల్‌ఆర్సీ) సమావేశాన్ని నిర్వహించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో నాలుగో త్రైమాసికం మార్చి 31నాటికి బ్యాంకులు సాధించిన ప్రగతి అలాగే 2024–25కు ప్రతిపాదిత వార్షిక రుణ ప్రణాళిక అంశాలపై జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ జి.ఆంజనేయులు కలెక్టరుకు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2023–24 వార్షిక రుణ ప్రణాళికలో మార్చి 31 నాలుగో త్రైమాసికం చివరినాటికి జిల్లాలో మొత్తంగా రూ11,514కోట్లు లక్ష్యం కాగా, రూ14,678 కోట్లు రుణాలు అందించి 127.46శాతం ప్రగతి సాధించడంపై బ్యాంకర్లను కలెక్టర్ అభినందించారు. అదే స్ఫూర్తితో ఈ ఏడాది కూడా జిల్లా ఆర్థిక ప్రగతికి విరివిగా రుణాలు ఇవ్వాలని కలెక్టర్ బ్యాంకర్లను కోరారు. 2024–25కు ప్రవేశపెట్టిన రూ13,102కోట్లు వార్షిక రుణ ప్రణాళికలో ప్రాధాన్యత రంగాలకు రూ1,764 కోట్లు ప్రతిపాదించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా బ్యాంకర్లతో కలిసి 2024–25 జిల్లా వార్షిక రుణ ప్రణాళికను కలెక్టరు ఆవిష్కరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ జి.ఆంజనేయులు, ఎస్‌బీఐ ఆర్‌ఎం పి.మురళీనాయక్, నాబార్డ్ ఏజీఎం విజయ్ విహారి, దళిత ఇండ్రస్ట్రియల్ అసోసియేషన్ సభ్యులు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


మంగంపేట నిర్వాసితులకు పునరావాస పనులు వేగవంతం చేయాలి

మంగంపేట నిర్వాసితులకు పునరావస పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ మంగంపేట బెరైటీస్ ప్రాజెక్టుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా ఏపీఎండీసీ అధికారి మంగంపేటలోని బెరైటీస్ ప్రాజెక్టుపై వివిధ అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. ప్రాజెక్టు నిర్వాసితులకు చేపడుతున్న పునరావాస పెండింగ్ పనుల గురించి ఆర్‌అండ్‌బీ , హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్‌శాఖ అధికారులను అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు.



బాబు మాట నీటి మూట

- తల్లికి వందనంపై భగ్గుమంటున్న వివిధ వర్గాలు
- అందరికీ ఇవ్వాలంటూ డిమాండ్



ఆ మనిషేం మారలేదు. 'మారిన మనిషంటూ' జనాల్ని నమ్మించారంతే. అధికారమే పరమావధిగా ముఖానికేసుకున్న అబద్ధాల హామీల ముసుగు తొలగిపోయింది. బాబు నిజ స్వరూపమేంటో నెలరోజులకే బట్టబయలైంది. ఇంకేముంది 'నాడు–నేడు' వెలుగు కరిగిపోయి.. విద్యా వ్యవస్థపై మెలమెల్లగా 'చంద్ర' గ్రహణం పడుతోంది. అవును.. బాబు మాటలు నీటిమూటలేనని రుజువయ్యాయి.... ఇసుకపై రాతలుగానే మారిపోయాయి. 'తల్లికి వందనం' పేరిట చదువుకునే ప్రతి పిల్లాడికి ఏటా పదిహేను వేలు ఇస్తామని చంద్రబాబు మాటిచ్చారు. మేనిఫెస్టోలోనూ ప్రకటించారు. అంతేనా ఎన్నికల ప్రచారంలో కాలికి చక్రాలు కట్టుకుని మరీ ఊరూరా తిరిగి హామీ ఇచ్చారు. అవన్నీ గాలి మాటలేనని తేలిపోయాయి. అందలమెక్కి నెలరోజులైనా కాకముందే 'ఒక్కరికే వందన'మన్నారు. ఏడు పదుల వయసు ఒంటిపైకొచ్చినా.. పదవికి పద్నాలుగేళ్ల వయసుదాటినా మాటమీద నిలబడని మనిషిగా..చంద్రబాబు చరిత్రలో నిలిచిపోయారంటూ మేధావులు.. ప్రజా సంఘాల వారు విమర్శలు చేస్తున్నారు. 'నిన్ను నమ్మి మోసపోయాం బాబూ..' అంటూ తల్లులు మండిపడుతున్నారు. ఒక్క పథకమైనా చెప్పినట్లు చేశావా బాబూ.. ఇక నువ్వేం మారతావులే' అంటూ తూర్పారబడుతున్నారు. –సాక్షి, నెట్‌వర్క్

హామీ నిలుపుకోవాలి



ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పేరిట టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటే అంత మందికి డబ్బు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు జారీ చేసిన జీఓ 29లో ఆ స్పష్టత లేదు. ఇందువల్ల విద్యార్థుల తల్లిదండ్రులు అయోమయంలో పడ్డారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలుపుకోవాలి.

– వీరనాల శివకుమార్, జిల్లా కార్యదర్శి, డీవైఎఫ్‌ఐ

బాబుకిది పరిపాటే



ఎన్నికల సమయంలో ఓటర్లను ఆకర్షించేందుకు అలివిగాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని తుంగలో తొక్కడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు పరిపాటే. 2014లో కూడా రైతు రుణ మాఫీ వంటివి ఎన్నో వాగ్దానాలు చేసి ఆ తర్వాత వాటిని అమలు చేయని చరిత్ర ఆయనకుంది. ఇప్పుడు అదే కోవలో తల్లికి వందనం నిలిచింది.

– సగిలి రాజేంద్రప్రసాద్, ఎస్‌ఎఫ్‌ఐ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి, కడప

హామీని విస్మరిస్తే గుణపాఠం తప్పదు



ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు చదువుకునే పిల్లలకు రూ.15 వేలు వంతున చెల్లించాల్సిందే. పిల్లల చదువులు వృద్ధి చెందుతాయని నమ్మిన పేద, మధ్య తరగతి కుటుంబసభ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబుపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించారు. ఇప్పుడు ఇంటిలో ఎంత మంది ఉన్నా తల్లి ఖాతాకు ఒక్కరికే జమ చేయడం అంటే మిగిలిన వారికి ఇవ్వరన్న భయం చిన్నారుల తల్లిదండ్రుల్లో ఉంది. చిన్నారుల చదువుల విషయంలో హామీని విస్మరిస్తే కూటమి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు.

– బుక్కే విశ్వనాథనాయక్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు

బాబూ.. బాధ్యత లేదా!



కుటుంబంలో చదువుతున్న వారందరికి తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేయాలి. ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. అమలు చేయాల్సిన బాధ్యత బాబు ప్రభుత్వంపై ఉంది.

– జగన్, రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్, రాష్ట్ర అధ్యక్షుడు.

ఇచ్చిన మాట నెరవేర్చండి..



ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 'తల్లికి వందనం' పథకం ద్వారా అర్హులైన పిల్లలందరికీ పథకాన్ని వర్తింపచేయాలి. అలా కాకుండా లేని నిబంధనలు పెట్టడం, ఒక్కరికే పరిమితం చేస్తామనడం సరికాదు.

– ఎం.ఆర్. నాయక్, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర విశ్వవిద్యాలయాల కో–కన్వీనర్, వైవీయూ

చెప్పిన ప్రకారం అమలు చేయాలి



ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలి. ఎన్నికల ముందు ఒక మాట.. అధికారంలోకి వచ్చిన తర్వాత మరోమాట మాట్లాడటం కూటమి ప్రభుత్వానికి తగదు. ఇప్పుడు డబ్బులు ఇవ్వకపోతే వారి చదువులు మధ్యలోనే ఆగిపోతాయి. ఇచ్చిన మాట ప్రకారం తల్లికి వందనం పథకం ద్వారా చదువుకునే పిల్లలందరికి రూ.15 వేలు ఇవ్వాలి.

– ఎ.రామాంజులు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి



పిల్లలతో రేష్మా

చదువులపై ప్రభావం పడుతుంది

నా పేరు రేష్మా, రామాపురం మండలం నీలకంఠ్రావుపేట. మా ఆయన పేరు షేక్ జహీర్. మేము కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. మాకు ఏడుగురు పిల్లలు ఉన్నారు. వీరిలో నలుగురిని చదివిస్తున్నాం. ఇద్దరు ఒకటో తరగతి. మరొకరు మూడో తరగతి, ఇంకొకరు నాలుగో తరగతి చదువుతున్నారు. మిగిలిన ముగ్గురు చిన్న పిల్లలు. నలుగురిని ప్రైవేటు స్కూల్‌లో చేర్పించాం. ఫీజులు కట్టాలని యాజమాన్యం ఒత్తిడి చేస్తోంది.చంద్రబాబునాయుడు పిల్లలందరికీ తల్లికి వందనం ఇస్తామన్నారు. ఇంత వరకు డబ్బు ఖాతాలకు జమకాలేదు.పిల్లలను ఎలా చదివించుకోవాలి. తల్లికి వందనం పథకం డబ్బు జమచేస్తే ఊరట లభిస్తుంది. లేదంటే పిల్లల చదువుపై ప్రభావం చూపుతుంది.

నలుగురు పిల్లలకూ ఇవ్వాలి



పఠాన్ షంషాద్‌తో నలుగురు పిల్లలు

నా పేరు పఠాన్ షంషాద్. రాయచోటి. మా అయన పేరు ఖాదర్ వలి.మాకు నలుగురు పిల్లలు. మేము ఇద్దరం బేల్దారి కూలీలం. నలుగురినీ కూలి డబ్బులతో పోషిస్తూ చదివిస్తున్నాం. సీఎం చంద్రబాబు ఎన్నికలకు ముందు ఇంటిలో ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం పథకం ద్వారా రూ.15 వేలు ఇస్తానన్నారు. ఆయన చెప్పిన మాట నమ్మాం. ఇప్పుడు మాట మారిస్తే ఎలా.. నలుగురు పిల్లలను చదివించాలంటే కష్టంగా ఉంటోంది. ఆయన చెప్పిన విధంగా నలుగురు పిల్లలకు తల్లికి వందనం పథకం అమలు చేయాలి. ప్రజలను మోసం చేయడం సరికాదు.

తల్లికి వందనం.. పిల్లలకు బంధనం -9లో

క్లుప్తంగా

దాడి ఘటనపై కేసు నమోదు



గాయపడిన రవీంద్రారెడ్డి, శ్రీనివాసులు

ములకలచెరువు : వైఎస్సార్‌సీపీ మాజీ సర్పంచ్ రవీంద్రారెడ్డి, అతని అనుచరుడు శ్రీనివాసులుపై పలువురు టీడీపీ నాయకులు గురువారం రాత్రి దాడి చేసి తీవ్రంగా గాయపరచిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి పలువురు టీడీపీ నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. టీడీపీ నాయకుల దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితులను చికిత్స నిమిత్తం మదనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయపడిన రవీంద్రారెడ్డి ఫిర్యాదు మేరకు టీడీపీ నాయకులు తోటగిరి, పాలగిరి శిద్దా, శివకుమార్, రాజు, చెన్నకృష్ణ, రామాంజులు, రెడ్డెప్పలపై కేసు నమోదు చేశారు.

కువైట్‌లో తంబళ్లపల్లె వాసి మృతి



శ్యామ్‌కుమార్‌రెడ్డి (ఫైల్)

తంబళ్లపల్లె : అతను బతుకుదెరువు కోసం కువైట్ వెళ్లాడు. గుండెపోటుతో మృతి చెంది శవమై స్వగ్రామానికి చేరిన విషాద సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబీకుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రం సమీపంలోని కొండ కిందమేకలవారిపల్లెకు చెందిన శ్యామ్‌కుమార్‌రెడ్డి (46) భార్య మధుప్రియతో కలిసి 2019లో కువైట్‌కు వెళ్లాడు. ఆయన అక్కడ పెట్రోల్ బంకుల పర్యవేక్షకుడిగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 10వ తేదీన గుండెపోటుతో మృతి చెందాడు. ఈ విషయాన్ని మధుప్రియ ఫోన్ ద్వారా కె.మేకలవారిపల్లెలోని బంధువులకు సమాచారం అందించారు. మృతుడి భార్య, వారి బంధువులు మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చారు. శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు.

నీలి నాలుక వ్యాధితో జీవాలకు ముప్పు

- వర్షాల రాకతో గొర్రెలు, మేకలకు వ్యాప్తి
- వ్యాధి సోకితే వాటి ప్రాణాలకు రక్షణ కరువు
- అప్రమత్తత అవసరం అంటున్న పశు వైద్యులు
- ఆందోళనలో కాపరులు, యజమానులు



గొర్రెల మంద (ఇన్‌సెట్) గొర్రెకు సోకిన నీలి నాలుక వ్యాధి

కడప అగ్రికల్చర్ : జిల్లాలోకి రుతుపవనాల ఆగమనంతోపాటు అప్పుడప్పుడు ఏర్పడే ఉపరితల ఆవర్తనంతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని వర్షాలు కురుస్తున్నాయి. గొర్రెలు, మేకల యజమానులు మారిన వాతావరణంతోపాటు అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాలతో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జిల్లా వ్యాప్తంగా 13,46,266 గొర్రెలు, మేకలు ఉన్నాయి. ఈ వర్షాల రాకతో గొర్రెలు, మేకలకు నీలి నాలుక వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధిని ఆయా ప్రాంతాలను బట్టి మూతివాపు వ్యాధి, నోటి పుండ్ల వ్యాధి వంటి పేర్లతో కూడా పిలుస్తుంటారు. మందలో 50 నుంచి 70 శాతం గొర్రెలకు ఒకే సారి వచ్చే అవకాశం ఉంది. ఈ వ్యాధి సోకిన గొర్రెలలో 20 నుంచి 50 శాతం చనిపోయే అవకాశం ఉంటుంది. కావున గొర్రెలు, మేకల కాపర్లు, యజమానులు ఈ వర్షా కాలంలో వీటి పెంపకంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జిల్లాలో ఇప్పటికే చాలా మండలాల్లో ఈ వ్యాధి లక్షణాలు కనిపిస్తున్నట్లు పలువురు గొర్రెలు, మేకల యజమానులు తెలిపారు.

వ్యాప్తి ఇలా..

గొర్రెలకు ఈ వ్యాధి వైరస్‌ల ద్వారా సోకుతుంది. ఈ వైరస్‌లకు మాధ్యమిక అతిదేయి దోమ జాతికి చెందిన కీటకాల ద్వారా వ్యాప్తి చెందుతుంది. మందలో ఒక గొర్రెకు ఈ వ్యాధి వస్తే ఒక గొర్రె నుంచి మరో గొర్రెకి వ్యాప్తి చెందుతుంది. ఈ వ్యాధి ప్రభావం ముఖ్యంగా జూలై, ఆగస్టు, సెప్టెంబర్, డిసెంబర్ నెలల్లో ప్రబలుతుంది.

లక్షణాలు..

- గొర్రెలలోకి వైరస్ ప్రవేశించి వారం రోజుల్లో దాని ప్రభావం కనిపిస్తుంది.
- 105 నుంచి 106 డిగ్రీల జ్వరం వచ్చి ఐదు రోజులకు పైగా ఉంటుంది.
- జ్వరం వచ్చిన 48 గంటల తర్వాత నోటి నుంచి చొంగ కారడం, నోరు మొత్తం ఎర్రగా మారడం, చొంగ కూడా నురుగలా మారి పెదవులు, చిగుళ్లు, పై దవడ, నాలుక వాచిపోవడం, నాలుక ఇరువైపులా పుండ్లు ఏర్పడి బాగా ఉబ్బి నీలిరంగుకు మారుతుంది.
- గొర్రెలకు రక్తపు జీరలు కనిపించడం, ముక్కు లోపల భాగం నుంచి చీము రావడం, చీముతోపాటు రక్తం రావడం చేస్తుంది. ఈ తరువాత ముక్కులో జిగురు ఎండిపోవడంతో శ్వాస తీసుకోలేని పరిస్థితి ఏర్పడి గొర్రెలు, మేకలు చనిపోయే అవకాశం ఉంటుంది. ఈ వ్యాధి గొర్రెలు, మేకలకు సోకినప్పుడు వాటిల్లో గర్భస్రావం కూడా అయ్యే అవకాశం ఉంటుంది.
- వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న గొర్రెలలో కాళ్లకు కూడా పాకుతుంది. గిట్టల మొదటి భాగం ఎర్రగా కందిపోయి వాచి చీముపట్టి నడవలేక కుంటుతాయి.
- ఈ రోగం కారణంగా మేత తినలేకపోవడం వల్ల జీవాలు నీరసించి బరువు కోల్పోయి మృత్యువాత పడతాయి.
- వ్యాధి చివరి దశలో నాలుక నీలిరంగుకు మారుతుంది. నోటి నుంచి దుర్వాసన వస్తుంది.
- ఈ వ్యాధి మేకలకు అరుదుగా సోకుతుంది.

నివారణ

- జబ్బు చేసిన వాటిని మందలోని ఆరోగ్యవంతమైన జీవాల నుంచి వేరు చేయాలి. జబ్బు చేసిన వాటికి చికిత్స చేయాలి.
- పొటాషియం పర్మాంగనేట్ ఒక శాతం ద్రావణంతో నోటిలో పుండు కలిగి చోట శుభ్రమైన పాడిగుడ్డతో తుడిచి బోరో గ్లిసరిన్ ఆయింట్‌మెంట్ రాయాలి. లేదా టాపిక్యూర్ ఓరల్ స్ప్రే కూడా వాడవచ్చు.
- పశువైద్య డాక్టర్‌ను సంప్రదించి పెన్సిలిన్, ఓరల్ ఎన్రోఫ్లాక్సోసిస్ వంటి యాంటిబయాటిక్‌లను, జ్వరం రాకుండా మెలోనెక్స ప్లస్ మందులు నోటి ద్వారా గాని, ఇంజక్షన్ రూపంలో ఐదు నుంచి ఏడు రోజుల పాటు ఇవ్వాలి.
- గొర్రెలు నీరసంగా ఉంటే గ్లూకోస్, ఎలక్ట్రాల్ పౌడర్‌ను నీటిలో కలిపి తాగించాలి. – వ్యాధి నుంచి కోలుకున్నాక సలైనులు ఎక్కించడం, లివర్‌టానిక్, బలానికి విటమినులు కలిగిన టానిక్‌లు, ఖనిజ లవణాలు అందించాలి.

ఆయుర్వేద చికిత్స

- ఈ వ్యాధి సోకిన గొర్రెలు, మేకలకు నేరేడు చెక్క 100 గ్రాములు, తులసి ఆకులు 50 గ్రాములు, నేల వేము ఆకులు 50 గ్రాములు, నూరి ముద్ద చేసి రోజుకు ఒక సారి 3 రోజులు ఇవ్వాలి.
- 150 గ్రాముల వావిల ఆకులు, 100 గ్రాముల వేపాకు ఒక నీటరు నీటిలో అర లీటరు అయ్యే వరకు మరిగించి ఆ నీటిని రోజుకు రెండు సార్లు చొప్పను 3 రోజులు ఇస్తే తగ్గిపోతుంది.

హోమియో చికిత్స

ఉదయం.. : వ్యాధి సోకిన వాటికి ఉదయం ఎనిసేసియ 200, మెర్క్‌సాల్ 200, ఆసియం 200 మందులు తీసుకుని 5 చుక్కలు లేదా 5 మాత్రలు, 5 ఎంఎల్ వైవిరాల్ అనే విటమిన్లు ద్రావణంలో కలిసి ఉదయం ఇవ్వాలి.
మధ్యాహ్నం.. : రుస్ టాక్స్ 200లను 5 చుక్కలు లేదా 5 మాత్రలు వేయాలి.
సాయంత్రం.. : పల్సటిల్ల 200లను 5 చుక్కలు లేదా 5 మాత్రలను వేయాలి. లేదంటే జెమ్ ఫార్మ వారి బూటి – డీఎస్‌ఓ అనే మందును వాడాలి.

జాగ్రత్తలు పాటించాలి



ఈ వ్యాధి దోమకాటుతో వ్యాప్తి చెందుతుంది. కాబట్టి గొర్రెల కాపర్లు సాయంత్రం వేళ 6 నుంచి 7 గంటలలోపే వేపాకు లేదా యూకలిప్టస్ ఆకు లేదా కలబందను కాల్చి మంద చుట్టూ వేయాలి. ఈ పొగకు దోమలు దూరంగా పారిపోతాయి. ముఖ్యంగా వ్యాధి సోకిన గొర్రెను మంద నుంచి వేరుచేయాలి. ఎందుకంటే దానిని కుట్టిన దోమ ఆరోగ్యంగా ఉన్న గొర్రెను కుడితే దానికి కూడా వ్యాధి సోకుతుంది. గొర్రెలు, మేకల షెడ్లలో కీటకాలను చంపేందుకు ముందులు పిచికారి చేసుకుంటే వ్యాధి సోకకుండా ఉంటుంది. – డాక్టర్ రాంబాబు, పశువైద్యాధికారి, కడప

టీకాలు వేయించాలి



ప్రభుత్వం తరపున ఇండియన్ ఇమ్యూనోలాజికల్ లిమిటెడ్ సంస్థ రక్షా బ్లూ పేరిట సరి కొత్త టీకాను రూపొందించింది. 2 మిల్లీల ఇంజెక్షన్‌ను కండకు గానీ, చర్మం కింద గానీ ఇవ్వాలి. కండకు ఇవ్వడం వల్ల నొప్పులు ఉండవు. గర్భంతో ఉండే జీవాలకు ఈ టీకాను ఇవ్వకూడదు. టీకాను వేసిన తరువాత 21 రోజులలోపు కబేలాలకు పంపకూడదు. – డాక్టర్ శారదమ్మ, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

కారుకు నిప్పంటించుకుని వ్యక్తి మృతి



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

పులివెందుల రూరల్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని బొగ్గుడుపల్లె గ్రామానికి చెందిన ప్రభాకర్‌రెడ్డి (80) మద్యం మత్తులో కారుకు నిప్పంటించుకొని మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. ప్రభాకర్‌రెడ్డి కొద్దిరోజులుగా మతిస్థిమితం సరిగా లేకపోవడంతో వింతవింతగా ప్రవర్తిస్తున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం తన కల్లంలో ఉన్న కారులోకి వెళ్లి పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. ఫైర్‌స్టేషన్ ఎస్సై రామకృష్ణకు సమాచారం రావడంతో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే ప్రభాకర్‌రెడ్డి మృతి చెందినట్లు ఆయన తెలిపారు.

వేడినీళ్లు పడి చిన్నారికి గాయాలు



గాయపడ్డ నాన్విక

మదనపల్లె : వేడి నీళ్లు ఒంటి మీద పడి చిన్నారి తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం మదనపల్లె మండలంలో జరిగింది. కోళ్లబైలు పంచాయతీ మేకలవారిపల్లెకు చెందిన శివ, సుగుణ దంపతుల కుమార్తె నాన్విక(3) ఇంట్లో ఆడుకుంటూ ఉండగా.. ప్రమాదవశాత్తు వేడినీళ్లు పడి తీవ్రంగా గాయపడింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి అత్యవసర విభాగ వైద్యులు చికిత్సలు అందించడంతో చిన్నారి కోలుకుంటోంది.

బైక్ అదుపు తప్పి..



గాయపడ్డ శ్రీనివాసులు

మదనపల్లె : ద్విచక్ర వాహన ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం రాత్రి ములకలచెరువు మండలంలో జరిగింది. గుడిపల్లెకు చెందిన నారాయణ కుమారుడు శ్రీనివాసులు(50) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ద్విచక్రవాహనంలో వ్యక్తిగత పనులపై ములకలచెరువుకు వెళ్లి తిరిగి వస్తుండగా, మార్గంమధ్యంలో ఒక్కసారిగా నెమళ్లగుంపు అడ్డుపడటంతో అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు 108 అంబులెన్స్‌లో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం లారీ

చిన్నమండెం : కర్నూలు నుంచి కర్ణాటక బంగారుపేటకు వెళ్తున్న రేషన్ బియ్యం లారీని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 8వ తేదీన చిన్నమండెం బస్టాండ్ సర్కిల్‌లో పోలీసులు 570 బస్తాల రేషన్ బియ్యం లారీని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిపై ఇన్‌చార్జి ఎస్‌ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి విచారణ చేపట్టి, రేషన్ బియ్యం లారీని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు అప్పగించారు.

నీటి పైపుల చోరీకి యత్నం

కొండాపురం : మండలంలోని దొంతికోనలో వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించిన నీటి పైప్‌లైన్‌కు అమర్చిన ఇనుప పైపులు దొంగలించడానికి గుర్తు తెలియని వ్యక్తులు ప్రయత్నిస్తుండగా వాచ్‌మ్యాన్ కేకలు వేయడంతో పారిపోయినట్లు ఆలయ నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. పెన్నానది నుంచి దొంతికోన కొండపైకి వేసిన 35 ఇనుప పైపులను గురువారం మధ్యాహ్నం కట్ చేస్తుండగా దేవస్థానానికి చెందిన వాచ్‌మ్యాన్ చూసి ఎవరు మీరు అంటు కేకలు వేయడంతో వాటిని అక్కడే వదిలేసి పరారయ్యారు. వీటి విలువ రూ.80 వేల వరకు ఉంటుంది.

చోరీ కేసు నమోదు

కడప అర్బన్ : కడప నగరం ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మారుతీనగర్‌లో నివాసం వుంటున్న చింతల వెంకటేశ్వర్లు ఈ ఏడాది మార్చి 26న ఉదయం 10 గంటలకు తాళం వేసి మధ్యాహ్నం 2:15 గంటల సమయంలో బయటకు వెళ్లాడు. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి ఇంటిలోని దాదాపు రూ.1.30 లక్షల విలువైన బంగారు ఆభరణాలను అపహరించుకుని వెళ్లారు. 18 గ్రాముల తాళిబొట్టు సరుడు, ఒక జత కమ్మలు, ఒక ఉంగరం అనే వస్తువులు చోరీ చేసుకుని వెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భాస్కర్‌రెడ్డి తెలియజేశారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కమలాపురం : కమలాపురం పట్టణంలోని దర్గా వీధికి చెందిన బక్కా సుబ్రహ్మణ్యం (35) తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ హృషికేశ్వర్ రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కడప కార్పొరేషన్‌లో ఔట్ సోర్సింగ్ కార్మికుడిగా పని చేస్తూ జీవనం సాగిస్తున్న సుబ్రహ్మణ్యం రెండు రోజుల క్రితం తన భార్యతో గొడవపడ్డాడు. దీంతో భార్య ఇందిర పుట్టింటికి వెళ్లింది. మనస్తాపానికి గురైన అతను గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం ఉదయం ఇరుగు పొరుగు వారు చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ హృషికేశ్వర్ రెడ్డి తన సిబ్బందితో కలసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆత్మహత్యపై స్థానికులతో ఆరా తీశారు. శవ పంచనామా నిర్వహించి పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. కాగా మృతునికి భార్య, ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి తండ్రి సుబ్బరాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ రెండు సంవత్సరాల ఇంటర్మీడియట్ మరియు డిగ్రీ 10th Class, APOSS ద్వారా కేవలం 1 సెలంలో అబుపోషు. ఆంధ్ర యూనివర్సిటీ ద్వారా BA, BCom, BSc, MA, MCom, MBA, MCA, MSC, కోర్సుల కొరకు. 9866050E.

■ ఒకే సంలో ఓపెన్ టెన్త్, ఇంటర్/మరియు డిగ్రీ/ పీజీ. దూర విద్యా ద్వారా 2024/24 అన్ని గ్రూపులు అడ్మిషన్లు ప్రారంభమైనవి. శ్రీహరి ఎడ్యుకేషన్ స్టడీ సెంటర్ 9849408340, 8639739908, కడప

■ B.Sc, P.B.B.Sc, GNM, DMLT, DOA, DRGA, DIALYSIS, DMST అడ్మిషన్లు జరుగుతున్నవి. సీట్లు పరిమితం, స్కాలర్‌షిప్ సౌకర్యం కలదు. వివరాలకై సంప్రదించండి. Aayushman Group Of Institutions. సెల్: 98495 65780.

WANTED

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9848666206,9573633520.

■ మైదుకూరులో పనిచేయుటకు ఫ్రంట్ షాప్, టిఫిన్, జ్యూస్ సెంటర్, ఫాస్ట్‌ఫుడ్, కూల్ డ్రింక్ షాప్ మరియు టీ మాస్టర్ అనుభవం ఉన్న వారు కావలెను. జీతం : 8-16 వేలు సంప్ర.6303025110.

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సాప్ చేయగలరు. 95026 15217

■ కస్టమర్లీస్ కాడVIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP&డాక్టర్స్ కావలెను.జీ: 15000 -40000,ఫ్రీరూం+భోజనం.HYD.7993583999

■ ప్రముఖ, ప్రసిద్ధి గాంచిన కంపెనీలో Team Leaders ప్రొద్దుటూరు ఏరియాలో పనిచేయుటకు Male / Female కావలెను. Qualification: Inter above. Cell: 9440351657

■ CC TV, సెక్యూరిటీ, Fir అలారమ్, బయోమెట్రిక్ సిస్టమ్స్ ప్రముఖ కంపెనీకి ఫీల్డ్ సర్వీస్ టెక్నీషియన్స్ కావలెను. Qly: ITI / అనుభవం, జీతం: 12K-20K PM. 93987 28839, 63007 40378

■ Required Lady Accountant in Battery Manufacturing Unit, Salary 12000+ Mobile Number : 9052998786, 9985988063

■ పాపారావు ఉన్నత పాఠశాల, కె ఉప్పలపాడు, ప్రకాశం నందు పనిచేయుటకు హిందీ టీచర్ (F), మహిళ వార్డెన్స్, ఎలక్ట్రీషియన్ కూడా కావలెను. ఉచిత వసతి + భోజన సదుపాయం కలదు. అర్హత అనుభవం బట్టి తగిన జీతం ఇవ్వబడును. సంప్ర॥ 70183 26519, 80086 22210

REALESTATE

FLAT FOR SALE

■ 1590 sft Flat in 4th Floor, Oxygen Towers, A.V. Apparao Road, RJY, with U/d Share 63 sqyds. For Sale Cont: 8374568999

SERIVCES

■ వ్యవసాయ, వ్యాపార, ప్రాపర్టీ మరియు వ్యక్తిగత కోసం అతి తక్కువ వడ్డీతో రుణాలు సిబిల్ అవసరం లేదు NPA కూడా దరఖాస్తు చేసుకోవచ్చు 9872006329.

BUSINESS OFFER

■ మేము మీ వ్యాపారాన్ని అభివృద్ధి చేయడానికి పెట్టుబడి పెట్టడానికి సిద్ధంగా ఉన్నాము. అలాగే ఏజెంట్లను కూడా ఆహ్వానిస్తున్నాము. 9082692403

CHANGE OF NAME

■ I, 14842546Y Rank NK/MT Chennam setty Subbaiah, I have changed my mother name (Old Name), Savithri (New Name) Chennamsetty Savitrimma. Affidavit No.0022115560 Date: 20/06/2024

PASSPORT MISSING

■ పాస్‌పోర్ట్ నంబర్ W2258998, యనమల మురళీకృష్ణ తండ్రి యనమల నాగభూషణం డి.నెం.8/20 అమ్మవారిపేట, బి.కోడూరు మండలం, వై.యస్.ఆర్. జిల్లా, ఆంధ్రప్రదేశ్ Pin-516188, అమ్మవారిపేట నుండి బి.కోడూరుకు వెళ్తుండగా ఒరిజినల్ పాస్‌పోర్ట్ పోయినది. దొరికినవారు తెలుపగలరు. సెల్: 8341202983

MARRIAGE SERVICES

■ SC మాదిగ / CNB / 2nd (12 సం॥ బాబు), 40/5'.4"/ B.Com, ఫెయిర్, Hyd లో హోటల్, సొంత క్యాటరింగ్, 2 L. PM, వరునికి. బిజినెస్ సపోర్ట్ కై 1/2వ చదువు వున్న వధువు కావలెను.డైరెక్ట్: 9618677114

సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010223797
9010072409

గమనిక

తుదిదశకు చేరుకున్న కబడ్డీ టోర్నమెంట్

– అండర్–14 విభాగంలో కడప జట్టుకు కాంస్య పతకం



కాంస్యపతకం సాధించిన కడప అండర్-14 జట్టు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇండియన్ సర్టిఫికెట్ సెకండరీ ఎడ్యుకేషన్(ఐసీఎస్‌ఈ) రీజినల్ కబడ్డీ టోర్నమెంట్ మ్యాచ్‌లు తుదిదశకు చేరుకున్నాయి. శుక్రవారం లీగ్ మ్యాచ్‌లతోపాటు క్వార్టర్ ఫైనల్, సెమీఫైనల్ మ్యాచ్‌లు ఉత్సాహంగా సాగాయి. అండర్–14 విభాగంలో హైదరాబాద్ పటాన్‌చెరువు శ్రీసాయిపబ్లిక్ స్కూల్, తూప్రాన్ అభ్యాస్ ఇంటర్నేషనల్ స్కూల్ జట్లు ఫైనల్‌కు చేరాయి. కడప హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ జట్టు మూడో స్థానంలో నిలిచి కాంస్యపతకం సాధించింది. అండర్–17 విభాగంలో హైదరాబాద్ పటాన్‌చెరువు శ్రీసాయి పబ్లిక్ స్కూల్, కర్నూలు జాన్సన్ గ్రామర్ స్కూల్ ఫైనల్‌కు చేరాయి. అండర్–19 విభాగంలో హైదరాబాద్ హబ్సిగూడ సెయింట్ జోసఫ్ స్కూల్ జట్టు, గుంటూరు లయోల పబ్లిక్ స్కూల్ జట్టు ఫైనల్‌కు చేరాయి. కాగా శనివారం అన్ని విభాగాలకు సంబంధించిన ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు టోర్నమెంట్ నిర్వాహకులు తెలిపారు. అండర్–14 విభాగంలో మూడోస్థానం లభించిన కడప హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ జట్టును పాఠశాల యాజమాన్యం అభినందించింది.

హాకీ క్రీడాకారులకు అవార్డులు



లక్ష్మీకి అవార్డు ప్రదానం చేస్తున్న ఏపీ హాకీ ట్రెజరర్ థామస్ పీటర్



రూనీస్‌కి అవార్డు అందజేస్తున్న హాకీ వైస్ ప్రసిడెంట్ సూర్యప్రకాష్

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని వైఎస్సార్ హాకీ క్రీడా మైదానంలో జరిగిన సౌత్ ఇండియా హాకీ చాంపియన్ షిప్ హాకీ క్రీడా పోటీలలో ఉత్తమ క్రీడాకారులకు శుక్రవారం అవార్డులు ప్రదానం చేశారు. గురువారం జరిగిన పోటీలలో తెలంగాణ– ఆంధ్రప్రదేశ్ మ్యాచ్‌లో ఆంధ్రా బెస్ట్ ప్లేయర్ లక్ష్మీకి ఏపీ హాకీ ట్రెజరర్ థామస్ పీటర్ అవార్డు ప్రదానం చేశారు. పాండిచ్చేరి-కేరళ మ్యాచ్‌లో పాండిచ్చేరి బెస్ట్ ప్లేయర్ రూనీస్‌కి ఏపీ హాకీ వైస్ ప్రసిడెంట్ సూర్యప్రకాష్ అవార్డును ప్రదానం చేశారు. వీరిని హాకీ కోచ్‌లు అభినందించారు.

జూదరుల అరెస్ట్

రామసముద్రం : రామసముద్రం పంచాయతీ ఉప్పినెల్లి చెరువులో శుక్రవారం పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.4420 స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ పేర్కొన్నారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం

కడప అర్బన్ : కడప జిల్లా అటవీశాఖ అధికారి పి.వి సందీప్‌రెడ్డి ఆదేశాల మేరకు కడప అటవీశాఖ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కె.ప్రసాద్, మద్దిమడుగు సెక్షన్ సిబ్బంది ఎస్.షకీల్, ఎస్, బాషా, యు.చౌడయ్య, ఎల్.ముఖర్జీ, నందిని, పార్వతి, ప్రొటెక్షన్ వాచర్స్ అందరూ కలిసి నైట్ పెట్రోలింగ్ విధులను నిర్వహించారు. ఈ విధుల్లో భాగంగా మద్దిమడుగు గ్రామానికి దగ్గర తనిఖీలు చేస్తుండగా రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో కడప- బెంగుళూరు జాతీయ రహదారికి ఆనుకుని కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు అటవీశాఖ వారిని చూసి పరారయ్యారు. వారు 28 ఎర్రచందనం దుంగలను వదిలేసి వెళ్లారు. వీటిని సీజ్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తగ్గుతున్న ఏపీఎండీసీ పాఠశాల ప్రభ

- యూనియన్‌ల పేరుతో ఉపాధ్యాయులు బోధనపై నిర్లక్ష్యం
- పాఠశాల విడిచి వెళ్తున్న విద్యార్థులు



మంగంపేట ఏపీఎండీసీ పాఠశాల

ఓబులవారిపల్లె : మంగంపేట ఏపీఎండీసీ ఫౌండేషన్ సీఎస్ఆర్ నిధులతో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రతిష్టాత్మంగా పాఠశాలను ఏర్పాటు చేశారు. మొదట్లో విద్యార్థులకు మెరుగైన విద్యా బోధనలు అందించడంతో పాఠశాలలో విద్యార్థుల శాతం అనూహ్యంగా సామర్థ్యానికి మించి పెరగడం జరిగింది. ప్రస్తుతం పాఠశాలలో 1048 మంది విద్యార్థులు ఉన్నారు. ఎల్‌కేజీ నుంచి పదవ తరగతి వరకు 22 తరగతి గదులలో 41 మంది ఉపాధ్యాయులు విద్యా బోధనలు చేస్తున్నారు. అయితే ప్రస్తుతం ఏపీఎండీసీ పాఠశాలలో ఉపాధ్యాయులకు ఒక యూనియన్, పని చేసే కార్మికులకు ప్రత్యేకమైన యూనియన్‌లు ఏర్పాటు చేసుకొన్నారు. దీంతో ఉపాధ్యాయులు యూనియన్ మీటింగ్‌లు, సమస్యలు అంటూ ఎక్కువ సమయం కేటాయిస్తుండటంతో విద్యార్థులకు బోధనలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఏపీఎండీసీ పాఠశాలలో బోధనలు సరిగా లేకపోవడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను వేరే పాఠశాలలో చేర్పించారు. ఇప్పటికే దాదాపు 50 మంది విద్యార్థులు టీసీలు తీసుకుని వేరే పాఠశాలకు వెళ్లడం జరిగింది. ఏపీఎండీసీ సీఎస్ఆర్ కోట్ల రూపాయల నిధులతో ఉద్యోగుల పిల్లలకు, చుట్టు పక్కల గ్రామాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యం నీరుగారుతోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా ఓ ఉపాధ్యాయుడు ప్రేమ పాఠాలు చెబుతున్నాడని విద్యార్థుల తల్లిదండ్రులు సీపీఓ సుదర్శన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై సీపీఓ సుదర్శన్‌రెడ్డిని వివరణ కోరగా తన దృష్టికి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు వచ్చాయని, ఇందుకు పాఠశాలలో విచారణ చేపట్టామని అన్నారు. వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. విద్యార్థులకు సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకొని రావలని సూచించారు. యూనియన్‌ల పేరు చెప్పి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయుల పట్ల వెంటనే చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

డీడీలపై సిబ్బంది అలసత్వం

వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం తీరు

కడప రూరల్ : డీడీలను సకాలంలో బ్యాంకులకు సమర్పించడంలో వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం (జోన్-4) సిబ్బంది అసలత్వం ప్రదర్శించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2023 సెప్టెంబర్ 20వ తేదీన ప్రభుత్వం స్టాఫ్ నర్స్ నియామకాలకు నోటిఫికేషన్ జారీ చేసింది. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తుతోపాటు వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం (జోన్-4) పేరు మీద నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీలు రూ. 300, ఓసీ వర్గానికి చెందిన వారు రూ.500 చొప్పున డీడీలు తీసి దరఖాస్తుతోపాటు ఆ శాఖకు సమర్పించారు. ఆ విధంగా దాదాపు 9 వేలకు పైగా దరఖాస్తులతోపాటు డీడీలు వచ్చాయి. కాగా ఆ కార్యాలయ సిబ్బంది ఖాతా కలిగిన బ్యాంకుకు వెళ్లి ఓచర్‌లో డీడీ వివరాలను పొందుపరిచి బ్యాంకులో సమర్పించాలి. అనంతరం బ్యాంకు వారు సదరు కార్యాలయం ఖాతాలో డబ్బును జమ చేయడం జరుగుతుంది.

1,600 పైగా డీడీలు...

కాగా పాతవి కొత్తవి కలిపి మొత్తం 1600కు పైగా డీడీలకు గడువు ముగిసింది. దరఖాస్తుల ద్వారా వచ్చిన సొమ్మును కార్యాలయానికి సంబంధించిన అవసరాలకు వినియోగించుకొనే అవకాశం ఉంటుంది. అంటే ఈ డబ్బుతో కంప్యూటర్స్, ఫర్నీచర్, స్టేషనరీతోపాటు నియామకాలు, పదోన్నతుల కౌన్సెలింగ్ తదితర ఆ శాఖ అవసరాల కోసం ఖర్చు చేయడానికి ఉపయోగిస్తారు. తాజాగా డీడీలకు గడువు ముగియడం అనే అంశం చర్చకు దారి తీస్తోంది.

వేల సంఖ్యలో డీడీలు ఉన్నందున...

వేల సంఖ్యలో డీడీలు ఉన్నందున జాప్యం జరిగింది. మార్చిలో బ్యాంకుల పని ఒత్తిడి కూడా కారణమైందని సిబ్బంది తెలిపారు. బ్యాంక్ అధికారులను సంప్రదించాం. డీడీలకు గడువు ముగిసినా ఫరవాలేదు. సమస్యను పరిష్కరిస్తాం అని చెప్పారు. ఒక రిక్వెస్ట్ లెటర్ పెట్టమన్నారు. అలాగే డీడీలు ఏ బ్యాంకుకు చెందినవైతే ఆ బ్రాంచికి పంపాలని సూచించారు. వారు చెప్పిన విధంగా చేశాం. ఒక వారం నుంచి ఆ పనుల మీదే మా సిబ్బంది పని చేస్తున్నారు. చాలా వరకు డీడీల సమస్యలను పరిష్కరించాం. మరి కొన్ని డీడీలు మాత్రమే ఉన్నాయి. ఒకటి రెండు రోజుల్లో అన్నీ క్లియర్ అవుతాయి.

– డాక్టర్ రత్నకుమారి, రీజనల్ డైరెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం కడప.

ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపుపై ఆందోళన

రైల్వేకోడూరు : మండలంలోని ఎస్.కొత్తపల్లె ఫీల్డ్ అసిస్టెంట్ జ్యోతిని టీడీపీ నాయకులు, అధికారులతో కుమ్మక్కై తొలగించిన విషయం తెలుసుకున్న గ్రామంలోని మహిళలు శుక్రవారం మధ్యాహ్నం ఉపాధి హామీ కార్యాలయంలోని ఏపీవో ఉమామహేశ్వరరావుపై ఆందోళనకు దిగారు. రెండేళ్లుగా ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న జ్యోతిని తొలగించి తెలుగుదేశం పార్టీకి చెందిన మహిళను ఫీల్డ్ అసిస్టెంట్‌గా చేర్చుకోవడం ఎంత వరకు న్యాయం అని గ్రామంలోని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. 'నీకు తెలియకుండానే ఈ వ్యవహారం అంతా జరుగుతుందా' అని మహిళలు ఏపీవోను నిలదీశారు. ఏపీవో డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్ జ్యోతిని యథావిధిగా కొనసాగించాలని, లేనిపక్షంలో తమ గ్రామంలో ఉపాధి హామీ పనులు వద్దు అని ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.కొత్తపల్లె గ్రామానికి చెందిన మహిళలు పాల్గొన్నారు.



ఏపీవో ఉమామహేశ్వరరావును నిలదీస్తున్న మహిళలు